క్లుప్తంగా

ఘనంగా చర్చి వార్షికోత్సవం

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో గల అగాపే చర్చి 8వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్లు జే.అబ్రహాం, శేఖర్ ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరి జీవితం, రాక పోకలలో ఏసుక్రీస్తు తోడై ఉన్నాడని, ఆయన కృపలో ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలని సూచించారు. ఇదే క్రమంలో అగాపే చర్చి సన్నిధి బాప్టిజం తీసుకున్న వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు శ్రీరాజ్ నాయక్, పాల్ మోహన్, వినోద్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

ప్రొద్దుటూరు : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా తెలిపిన మేరకు శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సాధారణ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు. పలువురు కౌన్సిలర్ల సూచన మేరకు ఫిబ్రవరి 1వ తేదీన తిరిగి సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. బడ్జెట్ సమావేశం మాత్రం యథావిధిగా జరుగుతుందన్న విషయాన్ని సభ్యులందరూ గమనించాలని ఆమె కోరారు.

సబ్ జైలు సందర్శన



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సబ్‌జైలును గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ సందర్శించారు. జైలు పరిసరాలను, వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను సబ్‌జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎంపీ చేయూత



విద్యార్థినికి నగదు అందజేస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం: జంప్ రోప్‌లో రాష్ట్ర స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని జెస్సీకి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేయూత నందించారు. గురువారం బి.మఠంలో ఎంపీ పంపిన నగదు రూ. 50 వేలను వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి, విద్యార్థిని అందజేశారు. ఇండో నేపాల్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న జంప్ రోప్ పోటీల్లో పాల్గొనున్న జెస్సీకి ఆర్థిక సహాయం చేయాలని ఎంపీని ఉపాధ్యాయుడు లెక్కల కొండారెడ్డి కోరారు. స్పందించిన ఎంపీ నగదును పంపారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నేలటూరు సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. మండలంలో మలుగుడుపాడుకు చెందిన సుబ్బిరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సి.వీరనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కార్యదర్శి సాల్మన్, ఉపాధ్యక్షుడు రమాదేవి, మోహన్, రాంబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సామగ్రి, యూనిఫాం ఇవ్వాలని కోరారు. చనిపోయిన కార్మికులకు రూ.2 లక్షల బీమా, పీఎఫ్ డబ్బు ఇవ్వాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు రూరల్: ప్రొద్దుటూరు మండలంలోని బీసీ, ఈబీసీ కులాలకు చెందిన ప్రజలు రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 112 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హత గల బీసీ, ఈబీసీ లబ్ధిదారులు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

చాపాడు: ఆర్థికంగా వెనకబడిన తరగతుల కులాల వారికి స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రామానుజం ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన తరగతులలో అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 7వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కుష్టువ్యాధి గ్రస్తులను చిన్నచూపు చూడొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధిగ్రస్తులను చిన్న చూపు చూడవద్దని డాక్టర్ మోహన్ కాంత్ తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జాతీయ కుష్టు వ్యతిరేక దినం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు మహాత్మాగాంధీ ఎనలేని సేవలు చేశారన్నారు. డీపీఎంఓ శివశంకరయ్య కుష్టువ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణా చర్యల గురించి వివరించారు. వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ.సుబ్బారెడ్డి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని సోములవారిపల్లె, చెన్నమరాజుపల్లె, గోపవరం గ్రామాల్లో గురువారం కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా మాట్లాడుతూ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సమాజంలో వివక్షతను ముగిద్దాం, గౌరవాన్ని స్వాగతిద్దాం అని ప్రజలు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డీపీఎంఓ శ్రీను, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, బీఏ.వరప్రసాద్, చంద్రకళ, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు మాతృ వియోగం



రాచమల్లు మునిరత్నమ్మ (ఫైల్)



రాచమల్లు మునిరత్నమ్మకు నివాళి అర్పిస్తున్న శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పక్కనే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తల్లి రాచమల్లు మునిరత్నమ్మ(82) గురువారం ఉదయం మృతిచెందారు. నాలుగు రోజుల కిందట పెద్ద కుమారుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి వెంట ఆమె హైదరాబాద్‌కు వెళ్లారు. ఉదయం హైదరాబాద్‌లోని ఇంటిలోనే ఆమె ఆకస్మికంగా మరణించారు. సాయంత్రం దొరసానిపల్లెలోని తమ ఇంటికి ఆమె భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. శనివారం ఉదయం పది గంటలకు రామేశ్వరంలోని హిందూ శ్మశాన వాటికలో రాచమల్లు మునిరత్నమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నివాళి అర్పించిన ప్రముఖులు

రాచమల్లు మునిరత్నమ్మ మరణించిన విషయాన్ని తెలుసుకుని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం మధ్యాహ్నం రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఫోన్‌చేసి పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి రాచమల్లును పరామర్శించారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డితోపాటు జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, భీమునిపల్లి లక్ష్మీదేవి, శేట్ గురివిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మల్లెల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, జింకా విజయలక్ష్మి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కల్లూరు నాగేంద్రారెడ్డితోపాటు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు నివాళి అర్పించారు.

రతనాల వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత రతనాల వెంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. సాయంత్రం మహిళలు ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమ, దీపాలతో సామూహికంగా కుంకుమార్చన చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి



రక్తదానం చేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్

ప్రొద్దుటూరు : రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పశు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసప్రసాద్ తెలిపారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గోపవరం పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అమర వీరుల సంస్మరణలో భాగంగా ఈ రక్తదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. యూనిట్ రక్తం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చని, మూగజీవులకు సేవ చేయడమే కాకుండా మనుషులను కాపాడే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ స్టాఫ్‌ను అభినందించారు. ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్, స్టాఫ్ విద్యార్థుల నుంచి మొత్తం 115 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, డాక్టర్ వాణి, డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు డాక్టర్ రాజకిశోర్, డాక్టర్ చరిత, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ రాయల్ రెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ అనూష, ఏఓ రాజేష్, మస్తాన్, సుబ్బారెడ్డి, బాలకృష్ణ, బాలుడు పాల్గొన్నారు.

మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



నరసింహారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : తమ స్వార్థం కోసం వన్యప్రాణులను వేటాడే నిమిత్తం అక్రమంగా పొలాల్లో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఓ వ్యక్తి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. వెంకటశెట్టిపల్లె గ్రామానికి చెందిన బీరంనరసింహారెడ్డి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గురువారం నరసింహారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొన్నేళ్ళుగా వన్యప్రాణుల వేట కోసం అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి పలువురు వ్యక్తుల మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఎమ్మెల్సీ నివాళి

పోరుమామిళ్ల : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. పాదిలి మస్తాన్, సాయి నారాయణరెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు. పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి గురువారం జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సీఎం బాషా, రాజీవ్‌బాషా, రాళ్లపల్లె నరసింహులు, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్ నివాళి అర్పించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

బద్వేలు అర్బన్ : వివిధ రకాల పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి, సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పన్ను వసూలు సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పన్ను వసూళ్ళు వేగవంతం చేయాలని అన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవడంతో పాటు నీటి సరఫరా, విద్యుత్ దీపాల నిర్వహణ ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పురపాలక సంఘంలోని ఆయా శాఖల అధికారులు, సీనియర్ అసిసెంట్లు, అకౌంటెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉష్ణమండల వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రొద్దుటూరు క్రైం : ఉష్ణ మండల వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదని సబ్ యూనిట్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ప్రపంచ నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణ మండల వ్యాధుల దినోత్సవం సందర్భంగా శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని శ్రీనివాసనగర్, వాస్తు కాంప్లెక్స్ వీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం నిర్లక్ష్యం చేసిన 20 రకాల వ్యాధుల్లో ఫైలేరియా వ్యాధి ఒకటన్నారు. ఈ వ్యాధి క్యూలెక్స్ అనే దోమ ద్వారా ప్రబలుతుందన్నారు. వ్యాధి సోకిన వారికి జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కాళ్లు చేతులు, రొమ్ముపై భాగంలోని గ్రంథుల్లో వాపు రావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సీఓ నాగజ్యోతి, ఏఎన్ఎం కవిత, ఆశ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్య వైశ్య వృద్ధాశ్రమం వద్ద గురువారం దివ్యాంగులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, అన్న ప్రసాదం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ గవర్నర్ రామచంద్రప్రకాష్ రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి కృష్ణమూర్తి, పద్మనాభయ్య, చలపతిరావు, అశోక్‌కుమార్, రామలింగేశ్వరరావు, నూర్‌బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

■ వాసవీ క్లబ్ సిరిపురం అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య ఆధ్వర్యంలో స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాసంశెట్టి సుధాకర్ గుప్తా, మేడా కామేశ్వరరావు, బచ్చు అశోక్ కుమార్, సభ్యులు జయం గోపాల్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మైదుకూరు : మైదుకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లు గీత కార్మికులకు రెండు మద్యం షాపులను కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, అవధూత కాశినాయన మండల పరిధిలో ఒక షాపును ఏర్పాటు చేయనున్నట్లు సీఐ పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈడిగ సామాజిక వర్గం వారు స్వగ్రామం, కుల ధ్రువీకరణ పత్రం, సబ్ క్యాస్ట్, ఇతర సర్టిఫికేట్లను స్థానిక తహసీల్దార్ వద్ద తీసుకుని ఫిబ్రవరి 5వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా గానీ, నేరు గానీ తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. దానితోపాటు నాన్ రీఫండబుల్ ధరావతు రూ.2లక్షలు చలానా డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం మైదుకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు బి.రామయ్య తెలిపారు. స్థానిక వాసవీ సర్కిల్‌లో కడపలో జరిగే జిల్లా మహాసభలకు వెళ్తున్న ఆటో డ్రైవర్ల వాహనాలను రామయ్య పతాకాన్ని ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి వై.హరి, సహాయ కార్యదర్శి ఎల్లయ్య, మాబు, పీర, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో రహదారి భద్రతపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ అతి వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. నిర్ణీత వేగానికి మించి వాహనాలు నడిపితే అదుపు తప్పే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యార్థులు, యువకులు ఎక్కువగా త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపల్ జీ.అశోక్ బాబు, గురుమూర్తిరెడ్డి, డాక్టర్ మహేష్, వై హరీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండగలరని బద్వేలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక వెంగమాంబ పాఠశాలలో 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆయన వెంగమాంబ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుల్లపనాయుడు, అడ్మినిస్టేటర్ నాగలింగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి

కలసపాడు : ప్రైవేటు స్కూల్ వ్యాన్ డ్రైవర్లు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని పోరుమామిళ్ళ సీఐ డి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కలసపాడులోని ప్రైవేటు స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు, క్లీనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్కూల్ బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీపై అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగంగా నడపటం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి అన్ని వాహన పత్రాలు కలిగి ఉండాలని, బస్సు సరైన కండీషన్‌లో ఉందో లేదో ముందే చూసుకోవాలన్నారు. స్కూల్ వాహనాలకు ఎలాంటి ప్రమాదం జరిగినా సంబంధిత డ్రైవర్, యాజమాన్యంపై చర్యలు ఉంటాయన్నారు. పిల్లలను స్కూల్‌కు తీసుకువచ్చే సమయం, వారి ఇళ్ళకు వదిలిపెట్టే సమయంలో బస్సు హెల్పర్ ముందు, వెనుక చూసుకున్న తర్వాతనే వారిని దింపాలి. నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై పోలీసులు, ఆర్‌టీఐ అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఘనమద్దిలేటి, హెల్పర్లు పాల్గొన్నారు.